## ఎన్నికల వ్యవస్థలో అరకొర మార్పులు - చిల్లర సంస్కరణల కంటే

# దామాషా పద్ధతి ఎన్నికలే మేలు

బలమైన లోక్‌పాల్ కోసం దేశంలో సాగిన చర్చ ఇప్పుడు ఎన్నికల సంస్కరణల మీద చర్చలు దారితీయడం ఒక మంచి పరిణామం. అవినీతికి వ్యతిరేకంగా దేశంలో దశాబ్దాల తరబడి ఉద్యమాలు సాగుతున్నాయి. ఈ ఉద్యమాలు నిర్వహిస్తున్న వివిధ స్రవంతులు ప్రజాచైతన్యాన్ని పెంచుతూవచ్చాయి. ఇటీవల ఈ అవినీతి వ్యతిరేక ఉద్యమం ఒక కొత్త దశకు చేరింది. అవినీతికి అడ్డుకట్ట వేసే బలమైన లోక్‌పాల్ చుట్టూ ఈ ప్రజాభిప్రాయం సమీకృతం అయింది. అన్నాహజారే దీక్ష దీని వ్యక్తీకరణ సాధన అయింది.

దేశంలో అవినీతి నిరోధానికి బలమైన చట్టం అవసరం. కాని అదొక్కటే సరిపోదు. కేవలం చట్టాలు మాత్రమే వ్యవస్థని పూర్తిగా చక్కదిద్దలేవు. దొంగల్ని శిక్షించడానికి చట్టాలు అవసరం. అయితే దొంగల్ని సృష్టిస్తున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థల్ని సంస్కరించకపోతే దొంగలు పుట్టుకొస్తూనే వుంటారు. దొరికినవాళ్లే దొంగలుగా శిక్షార్హులవుతారు. అవినీతి కూడా ఇలాంటిదే.

మన ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థ అవినీతి మీద మనుగడ సాగిస్తున్నది. దానిని పెంచి పోషిస్తున్నది. మన రాజకీయం ఇంతగా కుళ్లిపోవడానికి, ఇంతగా డబ్బు చుట్టూ తిరగడానికి, ఇంతగా అవినీతిమయం కావడానికి ఈ ఎన్నికల వ్యవస్థే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. మన రాజకీయ సంస్థలు ఈ ఎన్నికల వ్యవస్థని సంస్కరించకపోగా దానిలో భాగస్వామిగా మారాయి. ఎన్నికల్లో గెలుపుకోసం కోట్లు ఖర్చుపెట్టడం అధికారంలోకి రాగానే కోట్లు దండుకునేందుకు ద్వారాలు తెరవడం అలవాటు చేసుకున్నాయి. ఈ ఎన్నికల వ్యవస్థ వికృతరూపాన్ని దీన్ని అనుసరిస్తున్న పార్టీల విశృంఖల అవినీతిని ఇప్పుడు మనం స్పష్టంగా చూస్తున్నాం. అందుచేత అవినీతి మీద జరిపే పోరాటాన్ని మరో దశకు తీసుకువెళ్లాలి. రాజకీయ అవినీతికి జన్మస్థానంగా వున్న ఎన్నికల వ్యవస్థని మార్చడానికి, అవినీతిమయమైన రాజకీయ వ్యవస్థల ప్రక్షాళనకీ ఉద్యమాన్ని నడిపించాలి.

ప్రపంచంలో ప్రధానంగా రెండు తరహాల ఎన్నికల వ్యవస్థలు వున్నాయి. ఒకటి ఫస్ట్ పాస్ ది పోస్టు (FPTP) పద్ధతి. ఇక్కడ నియోజకవర్గం ప్రాతిపదికగా వుంటుంది. గెలుపు ఓటములు నియోజకవర్గంలోనే తేలిపోతాయి. పోటీ చేసే అభ్యర్థులలో ఎవరికి ఒక ఓటు ఆధిక్యత వస్తే వారు గెల్చినట్లు మిగిలిన వారు ఓడినట్లు. ఓడిన వారికి వచ్చిన ఓట్లు అక్కడే మురిగిపోతాయి. మనదేశంలో అటు పార్లమెంటుకీ ఇటు అసెంబ్లీకి మనం అనుసరిస్తున్న ఎన్నికల పద్ధతి ఇదే. ఈ పద్ధతిలో నియోజకవర్గంలో గెలుపు ముఖ్యం గనుక కేంద్రీకరణ అంతా నియోజకవర్గం మీద, అభ్యర్థుల మీద ఆధారపడి వుంటుంది. గెలుపును అందించే ఆ ఒక్క ఓటు పొందడం కోసం ధనబలం, కండబలం, కులబలం వగైరాలన్నింటినీ కేంద్రీకరించడం జరుగుతుంది. అందువల్లనే ఎన్నికల్లో కోట్లు గుమ్మరించడం తప్పనిసరి అయింది.

ఇక రెండవది దామాషా పద్ధతి ఎన్నిక. ఇందులో చాలా రకాలున్నాయి. చిన్న దేశాలు, తక్కువ జనాభా వున్న దేశాలలో పార్టీజాబితా పద్ధతి వుంది. ఈ పద్ధతిలో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను ముందుగా ప్రకటించి, ఎన్నికల కమిషన్‌కు అందజేస్తాయి. ఎన్నికల్లో పార్టీలకే ప్రజలు ఓట్లు వేస్తారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే ఆ దామాషాలో ఆ పార్టీకి సీట్లు వస్తాయి. పార్టీ ప్రకటించిన జాబితా వరుసక్రమంలో అభ్యర్థులు చట్టసభ సభ్యులవుతారు. ఈ పద్ధతిలో నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వుండదు.

మరో పద్ధతి నియోజక వర్గాలకు ప్రాతినిధ్యంతో కూడిన దామాషాపద్ధతి. దీనిలో ఒక చట్టసభలో ఉన్న స్థానాలను కొన్ని బ్లాకులుగా విభజించి దామాషా పద్ధతిలో ఎన్నికలు జరపడం. ఉదాహరణకి మన రాష్ట్రంలో 42 పార్లమెంటు స్థానాలు, 294 అసెంబ్లీస్థానాలు ఉన్నాయి. ప్రతి మూడు పార్లమెంటు నియోజకవర్గాలను అంటే 21 అసెంబ్లీస్థానాలను ఒక బ్లాక్‌గా తీసుకుంటే 14 బ్లాకులు ఏర్పడతాయి. రాజకీయ పార్టీలు ఈ బ్లాకుల వారీగా అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తాయి. ఆ బ్లాకులో వచ్చిన ఓట్ల

దామాషాలో ఆ పార్టీలు సీట్లు పొందుతాయి. ఈ పద్ధతిలో ఓట్ల దామాషాలో పార్టీలకు సీట్లు వస్తాయి. ప్రతి నియోజక వర్గానికి ఒక అభ్యర్థి ప్రతినిధ్యం కూడా ఉంటుంది.

మనం అనుసరిస్తున్న ఒక ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ ధనరాజకీయానికి తద్వారా అవినీతికీ ద్వారాలు తెరవడమే కాకుండా ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాలకు హాని చేస్తుంది. ఈ మౌలిక లక్ష్యాల ఆధారంగా ఈ రెండు ఎన్నికల పద్ధతుల్ని ఇప్పుడు పరిశీలించుకుందాం....

**ప్రతి ఓటుకీ చట్టసభలో ప్రాతినిధ్యం....**

మొదటిది: ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో పౌరులు వేసే ప్రతి ఓటుకీ చట్టసభలో ప్రాతినిధ్యం లభించాలి. అప్పుడే ఆ చట్టసభ ఓటర్ల అభిమతాన్ని ప్రతిబింబిస్తుంది. ఎన్నికల వ్యవస్థ దీనికి దోహదం చేసేదిగా వుండాలి. హరించేది కాకూడదు. ప్రస్తుతం ఒక్క ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ దీనిని ఎలా హరిస్తున్నదీ గత అసెంబ్లీ ఎన్నికలనే ఉదాహరణగా తీసుకుందాం.

2009 ఎన్నికలలో రాష్ట్రంలో 5,78,92,259 మంది ఓటర్లకు గాను 4,20,58,446 మంది ఓటు వేశారు. అంటే రాష్ట్ర శాసన సభ వీరందరికీ ప్రాతినిధ్యం వహించేదిగా వుండాలి. కాని అసెంబ్లీలో గెలిచిన 294 మంది అభ్యర్థులకీ వచ్చిన ఓట్లు కేవలం 1,72,43,593 మాత్రమే. వేసిన ఓట్లలో కేవలం 40 శాతానికి మాత్రమే రాష్ట్ర శాసనసభ ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఓటు వేసిన మిగిలిన 60శాతం ఓట్లు అంటే 2,48,14,853 మంది ఓట్లు వేసినా ప్రాతినిధ్యం లభించలేదు. ఇవి ఓడిన అభ్యర్థుల ఓట్లు. నియోజకవర్గం స్థాయిలోనే మురిగిపోయాయి. ఓటు వేసినా చట్టసభలో ప్రాతినిధ్యం లేనందువల్లనే చట్టసభలు రానురాను ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

ఇదే దామాషా పద్ధతి ఎన్నికలోనైతే పార్టీలకు వచ్చిన ఓట్లశాతం ఆధారంగా పార్టీలకు సీట్లు దక్కేవి. వేసిన ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం లభించేది. అప్పుడు చట్టసభలో ఈ పార్టీల బలాబలాలు వేరుగా వుండేవి.

**మంచి అభ్యర్థులకు అవకాశం**

నియోజకవర్గాలలో మంచి అభ్యర్థుల్నిఎన్నుకోవాలన్న భావనలో ఎవరికీ భిన్నాభిప్రాయాలు వుండవు. ఎన్నికల వ్యవస్థ అలాంటి అవకాశాన్ని కల్పించాలి. ప్రస్తుత వ్యవస్థలో పార్టీలకు అభ్యర్థులు కీలకం. సమాజహితం కోరే అభ్యర్థి కంటే గెలుపు గుర్రాలే పార్టీలకి అవసరం. ఎన్నిఓట్లు వచ్చినా గెలవకపోతే పార్టీ నష్టపోతుంది. అందుచేత పార్టీలు ధనబలం, కండబలం, కులబలం అభ్యర్థులకే మొగ్గుచూపడం తప్పనిసరి అయింది.

దామాషా పద్ధతి ఎన్నికలలో అభ్యర్థుల కంటే పార్టీలకు వచ్చే ఓట్లే ప్రధానం అవుతాయి. అందుచేత అభ్యర్థుల ఎంపికలో పార్టీ ప్రతిష్ఠ ప్రధానమౌతుంది. దానికి తగిన అభ్యర్థులను పార్టీలు ఎంచుకొనే అవకాశం కలుగుతుంది.

**విధానాలపరంగా సంఘర్షణ**

ఇక మూడవదీ చివరిదీ. ఒక్క ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ పార్టీలలో సిద్ధాంత రాహిత్యానికి, విధానాల లేమికి, అభివృద్ధి వ్యూహాల శూన్యతకీ దారులు వేసింది. పార్టీలకు గెలిచే అభ్యర్థులు ప్రధానం కావడం, వారి స్థానిక స్థానబలిమి మీద ఆధారపడడంతో పార్టీల వ్యవస్థ బలహీనపడింది. పార్టీ, జెండా ఇప్పుడు అభ్యర్థులకు ఎన్నికల్లో ఒక సహాయ సాధనంగా మారింది. పార్టీల తెరచాటు వున్నప్పటికీ నియోజకవర్గ స్థాయిలో సమీకరణాల మధ్య సంఘర్షణగా అది పరిణమిస్తున్నది. స్థానిక గెలుపు ప్రధానం గనుక పార్టీలు దానిని ప్రోత్సహిస్తున్నాయి.

రాజకీయ సంఘర్షణ పార్టీల మధ్య, వాటి సిద్ధాంతాల మీద, విధానాల మీద అభివృద్ధి వ్యూహాలమీద జరగాలి. దామాషాపద్ధతి ఎన్నికలలో పార్టీకి వచ్చే ఓట్లే అంతిమంగా సీట్లను తెచ్చిపెడతాయి. అందుచేత పార్టీలకు విధానపరమైన సంఘర్షణ తప్పనిసరి అవుతుంది.

మొత్తంమీద ఏ ఎన్నికల వ్యవస్థా పరిపూర్ణంకాదని అందరూ అంగీకరిస్తారు. కాని ఒక్క ఓటు మెజారిటీ వ్యవస్థ కంటే దామాషా పద్ధతి మెరుగైనదీ ప్రజాస్వామ్య పరిపుష్టికి దోహదం చేసేది అని నిస్సందేహంగా చెప్పవచ్చును. అందుచేత ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో అరకొర మార్పుల మీద, చిల్లర సంస్కరణల మీద చర్చకు స్వస్తి చెప్పి కొత్త ఎన్నికల వ్యవస్థకోసం ఉద్యమించడం శ్రేయస్కరం.